క్లుప్తంగా

ఇనిమెళ్లలో రీసర్వే పనులను పరిశీలించిన కలెక్టర్



ఈపూరు: భూముల రీసర్వే వేగవంతంగా, పారదర్శకంగా జరగాలని పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ అన్నారు. మండలంలోని ఇనిమెళ్ల గ్రామంలో జరుగుతున్న రీసర్వే పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే సిబ్బందితో మాట్లాడుతూ భూముల రీసర్వే వేగవంతంగా జరుగుతుందా లేదా అని తెలుసుకున్నారు. ప్రభుత్వం రీసర్వేను ప్రతిష్టాత్మకంగా తీసుకుంది కనుక ఎటువంటి అపోహలకు తావులేకుండా న్యాయబద్ధంగా సర్వే జరగాలని ఆయన సూచించారు. వేగవంతంగా జరగాలని, ఎప్పటికప్పుడు రిపోర్ట్‌ను అప్‌డేట్ చేయాలని, రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సర్వే జరపాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుధాకర్ తదితరులు ఉన్నారు.

శ్రీశ్రీ కళావేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రాకేష్



నరసరావుపేట ఈస్ట్: అంతర్జాతీయ సాహిత్య, సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ శ్రీశ్రీ కళావేదిక ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పట్టణానికి చెందిన గుండాల రాకేష్ నియమితులయ్యారు. ఈమేరకు కళావేదిక జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి తన నియామక ఉత్తర్వులను జారీ చేసినట్టు రాకేష్ మంగళవారం తెలిపారు. తనకు ప్రోత్సాహాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కళావేదిక చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్, జాతీయ అధ్యక్షులు జి.ఈశ్వరీ భూషణం తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

13లోగా దరఖాస్తు చేసుకోండి

నరసరావుపేట: పురపాలక పరిధిలో ఖాళీగా ఉన్న నాలుగు వలంటీర్ల పోస్టులకు ఈనెల 13వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ జి.రామ్మోహన్ మంగళవారం సూచించారు. ఖాళీలకు సంబంధించిన నోటిఫికేషన్ సచివాలయాలు, పురపాలక కార్యాలయాల్లో ఉంచటం జరిగిందన్నారు.

మరొకరిని బలితీసుకున్న తిమ్మాపురం రోడ్డు ప్రమాదం



యడ్లపాడు: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధురాలు మృతి చెందినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని తిమ్మాపురం 16వ నంబర్ జాతీయ రహదారిపై సోమవారం రాత్రి ఆటో కోసం వేచి చూస్తుండగా అదే సమయంలో చిలకలూరిపేట వైపు నుంచి వేగంగా దూసుకువచ్చిన బైక్ మహిళల్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో తిమ్మాపురం ఎస్సీ కాలనీకి చెందిన జ్యోతి సునీత (40) అక్కడికక్కడే మృతి చెందగా, పెదనందిపాడు మండలం పెదగొట్టిపాడు గ్రామానికి చెందిన జొన్నలగడ్డ మరియమ్మ, ధర్నాసి చిన్నమ్మాయిలకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్సల అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరియమ్మ (62) వృద్ధురాలు మృతి చెందగా, చిన్నమ్మాయి మాత్రం చికిత్స పొందుతున్నట్లు పోలీసులు తెలిపారు.

ఏఎంజీలో క్రీడాకారుల ఎంపిక



చిలకలూరిపేట టౌన్: ఏఎంజీ ఇండియా ఇంటర్నేషనల్ క్రీడా ప్రాంగణంలో ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్స్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నెట్ బాల్, జూడో జిల్లా జట్ల ఎంపిక మంగళవారం నిర్వహించారు. ఈ ఎంపిక పోటీలు పలు విభాగాల్లో బాలబాలికలకు నిర్వహించారు. బాలికల విభాగంలో అండర్–14 17, 19 నెట్‌బాల్, జూడో బాలుర విభాగంలో అండర్–14,17,19 నెట్ బాల్, జూడో పోటీల ఎంపికలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎంజీ ఇండియా ఇంటర్నేషనల్ సంస్థ డైరెక్టర్ డాక్టర్ అరుణ్‌కుమార్ మహంతి, జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి జి.కోటేశ్వరి, ప్రతాపరెడ్డి, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా కూర్పుపై ఆర్డీవో సమావేశం

నరసరావుపేట: జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు మంగళవారం సాయంత్రం ఆర్డీవో కార్యాలయంలో ఓటర్ల నమోదు అధికారి, ఆర్డీవో ఎం.శేషిరెడ్డి అధ్యక్షతన నియోజకవర్గంలోని అసిస్టెంట్ ఎన్నికల అధికారులు, అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. వచ్చే ఏడాదిలో నిర్వహించే సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఎస్ఎస్ఆర్–24కు సంబంధించి ప్రీ రివిజన్ యాక్టివిటీస్, ఇంటింట సర్వే, డెత్, డూప్లికేట్, షిఫ్టెడ్, ఓటర్ల తొలగింపు తదితర అంశాలను గురించి వివరించారు. తహసీల్దార్లు ఆర్‌వీ రమణానాయక్, అంకారావు, కమిషనర్ జి.రామ్మోహన్, పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



గురువాయపాలెంలో సురక్ష శిబిరానికి హాజరైన వైద్య,ఆరోగ్య సిబ్బంది



గుమ్మనంపాడులో మందులు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది



సాతులూరులో వృద్ధుడిని పరీక్షిస్తున్న డెంటిస్ట్ డాక్టర్ శివన్నారాయణ



మునుమాకలో వివరాలు తెలుసుకుంటున్న డాక్టర్ జి.గీతాంజలి

ఆరోగ్యానికి రక్ష - జగనన్న సురక్ష

- వేర్వేరు ప్రాంతాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు
- భారీగా తరలివచ్చిన గ్రామస్తులు
- ఉచితంగా పరీక్షలు, మందులు అందజేత

నరసరావుపేట: రొంపిచర్ల మండలంలోని మునుమాక గ్రామంలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో 364 మందికి పరీక్షలు చేసి మందులు అందజేశారు. వీరిలో వివిధ రోగాలతో 337 మంది బాధపడుతున్నట్లు గుర్తించారు. గ్రామ ఎంపీటీసీ గుండాల వెంకటేష్, సర్పంచ్ అశ్రిఫూన్, ఉపసర్పంచ్ జాన్‌సైదా వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. గ్రామస్తులకు డాక్టర్లు కిషోర్, వేణు, నరసింహా రెడ్డి, రేవతి వైద్య పరీక్షలు చేసి మందులను రాశారు. శిబిరాన్ని జిల్లా ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ నాగపద్మజ, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ బి.గీతాంజలి, తహసీల్దార్ అంకారావు సందర్శించి కార్యక్రమం జరుగుతున్న తీరును పరిశీలించారు. డాక్టర్లు, సిబ్బందికి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు సేవలు అందజేయగా అంగన్వాడీ కార్యకర్తలు పౌష్టికాహార పదార్థాలతో వండిన వంటకాలతో స్టాల్‌ను ఏర్పాటు చేశారు.

సాతులూరులో..

నాదెండ్ల: ప్రజల ఇంటి ముంగిటకే కార్పోరేట్‌స్థాయి వైద్య సేవలందిస్తూ ఆరోగ్యాంధ్రప్రదేశ్ సాకారానికి బాటలు వేసిన ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డికే సాధ్యమైందని ఎంపీపీ తలతోటి రాణి, జెడ్పీటీసీ కాట్రగడ్డ మస్తాన్‌రావు చెప్పారు. మండలంలోని సాతులూరు 1వ సచివాలయం పరిధిలోని గుంటూరు వెంకటప్పయ్య ప్రాథమిక పాఠశాలలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య క్యాంపు నిర్వహించారు. నాదెండ్ల, గణపవరం పీహెచ్‌సీల వైద్యులు ప్రియాంక, ఎల్.ప్రసాద్ నాయక్‌తోపాటూ నరసరావుపేట స్మైల్ డెంటల్ వైద్యులు శివనారాయణ, కాటూరి వైద్యశాల వైద్య నిపుణులు గీతాంజలి, గైనకాలజిస్ట్ వినీత హాజరయ్యారు. ఈ సందర్భంగా 573 మందికి 14 రకాల పరీక్షలు నిర్వహించి 105 రకాల మందులు ఉచితంగా అందించారు. మెరుగైన వైద్యం కోసం నలుగురిని ఆరోగ్యశ్రీ ద్వారా రిఫర్‌చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు బండారు శ్రీవరప్రతాప్, ఎంపీటీసీ పాటిబండ్ల రాజేశ్వరి, ఎంపీడీవో షేక్ జాకీర్‌హుస్సేన్, ఎంఈవో ఆంజనేయులు, గణపవరం, నాదెండ్ల సొసైటీ అధ్యక్షులు మంగు ఏడుకొండలు, కురుకుంట్ల వెంకటరెడ్డి, పాల్గొన్నారు.



సాతులూరులో కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య బృందం

ముప్పాళ్లలో..

ఈపూరు: ఒక నాడు వైద్యం కోసం హాస్పటల్స్ చుట్టూ తిరగాల్సి వచ్చేదని.. నేడు అదే వైద్యాన్ని పేదల ముంగిటకు తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. మండలంలోని ముప్పాళ్ల గ్రామంలో మంగళవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, జడ్పీటీసీ చౌదయ్య, గ్రామసర్పంచ్ బయ్యారపు రమ్య, మండల పార్టీ అధ్యక్షులు దేవరాజ్, ఈపూరు సొసైటీ అధ్యక్షుడు బొల్లా రాధాకృష్ణ, శాకమూరి బుచ్చయ్య, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



సాతులూరులో వృద్ధుడికి ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ ఎల్.ప్రసాద్‌నాయక్

గురవాయపాలెంలో 505 మందికి ..

నరసరావుపేట రూరల్: మండలంలోని గురవాయపాలెం సచివాలయం పరిధిలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 505 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. వైద్య శిబిరానికి హాజరైనవారిలో 271 మంది మహిళలు, 224 మంది పురుషులు, 16మంది విద్యార్థులు ఉన్నారు. వీరిలో 180మంది కంటి సంబంధిత సమస్యలతో బాధపడుతున్నవారికి పరీక్షలు నిర్వహించి 140మందికి కళ్లజోళ్లు అవసరమని సూచించారు. కోటప్పకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.నందకుమార్, డాక్టర్ బి.జోయల్ ప్రసాద్, డాక్టర్ జి.గ్రేస్, జనరల్ సర్జన్ డాక్టర్ సిహెచ్ ఫణికుమార్, గైనకాలజిస్ట్ డాక్టర్ జి.లక్ష్మీలు శిబిరంలో వైద్య సేవలు అందించారు. ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, సర్పంచ్ కురుగుంట్ల మాణిక్యాలరావు, పంచాయతీ కార్యదర్శి రమాదేవి, వైద్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



గురవాయపాలెంలో విద్యార్థినికి రక్తపరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పేద ప్రజల ఆరోగ్య ప్రదాయని

బొల్లాపల్లి: రాష్ట్ర ప్రజల ఆరోగ్య ప్రదాయని జగనన్న ఆరోగ్య సురక్ష అని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. మండలంలోని గుమ్మనంపాడు గ్రామ సచివాలయంలో జడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద ప్రజల ఆరోగ్యానికి జగనన్న ఆరోగ్య సురక్ష పథకం భరోసా ఇస్తుందని తెలిపారు. బొల్లాపల్లి, వెల్లటూరు పీహెచ్‌సీ వైద్యాధికారులు జి.వీర నరేష్, పి.శంకర్‌నారాయణ, ఎం.సాయి వినూత్న, ప్రత్యేక వైద్య నిపుణులు రేణుకా దేవి, సాయిలక్ష్మి, వైద్య శిబిరంలో వైద్య సేవలు అందజేశారు. ఈ వైద్య శిబిరంలో 584 మందికి వైద్య చికిత్సలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. బొల్లాపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి పి. శంకర్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వంకాయలపాడులో..

యడ్లపాడు: జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజల చెంతకే వైద్యం సేవలు చేరువయ్యాయని ఎంపీపీ పిడతల ఝాన్సీ చెప్పారు. మండలంలోని వంకాయలపాడు గ్రామ సచివాలయం పరిధిలోని జెడ్పీహైస్కూల్లో మంగళవారం జేఏఎస్ క్యాంపును అధికారులు నిర్వహించారు. ఉదయం 9 గంటలకు ఉప్పరపాలెం, బోయపాలెం, వంకాయలపాడు గ్రామాలకు చెందిన ప్రజలు అధిక సంఖ్యలో చేరుకున్నారు. యడ్లపాడు పీహెచ్‌సీ వైద్యులు ఎం.ప్రభాకరరావు నేతృత్వంలో స్పెషలిస్టు డాక్టర్లు రమ్యతసాయి, ఎ.సంతోష్‌కుమార్, ప్రతాప్, పి.పూజిత పాల్గొన్నారు. మూడు గ్రామాల్లో ముందుగానే ఇంటింటి సర్వేలో 386 కూపన్లు అందించిన వారితో పాటు నేరుగా వచ్చిన 53 మందికి ఓపీ రిజిస్ట్రేషన్లు చేశారు.





గుమ్మనంపాడు శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు



వంకాయలపాడు క్యాంపులో మందులు పంపిణీ చేస్తున్న సిబ్బంది

ఆరోగ్యవంతమైన సమాజమే లక్ష్యం

పల్నాడు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి

యడ్లపాడు: ఆరోగ్యవంతమైన సమాజమే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి శ్రీకారం చుట్టారని పల్నాడు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి చెప్పారు. పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం వంకాయలపాడు గ్రామ సచివాలయం పరిధిలో మంగళవారం జేఏఎస్ శిబిరం జరిగింది. గ్రామంలోని జెడ్పీ హైస్కూల్ ఆవరణలో నిర్వహించిన ఈ క్యాంపును డీఎంహెచ్‌వో బి.రవి, జిల్లా అంధత్వ నివారణ అధికారి ఎ.భువనేశ్వరీ వేర్వేరుగా సందర్శించారు. ముందుగా ఎంపీపీ పి.ఝాన్సీ, సర్పంచ్ వడ్డేపల్లి నరసింహారావు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి సురక్ష క్యాంపుల్ని ప్రారంభించారు. అనంతరం శిబిరంలోని అన్ని స్టాల్స్‌ను పరిశీలించారు. జిల్లాలో గతనెల 30వ తేదీ నుంచి ఇప్పటి వరకు 199 సురక్ష శిబిరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆయా శిబిరాల ద్వారా 63,741 మంది ఓపీలకు రాయించుకుని వివిధ రకాల అనారోగ్య సమస్యలను పరీక్షలు, చికిత్సలు చేయించుకున్నరని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ పి.ఝాన్సీ, సర్పంచ్ వడ్డేపల్లి నరసింహారావు, ఎంపీడీవో వై.హనుమారెడ్డి, పీహెచ్‌సీ వైద్యులు ఎం.ప్రభాకరరావు, ఎంపీటీసీలు షేక్ నాజూలా, బుల్లియ్య, సాంబశివరావు, షేక్ ఖాదర్‌మస్తాన్ పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతుల పట్ల బాధ్యతగా మెలగాలి

నరసరావుపేట ఈస్ట్: విభిన్న ప్రతిభావంతుల హక్కులను ప్రతి ఒక్కరూ గౌరవించాలని అదనపు సీనియర్ సివిల్ జడ్జి కె.మధుస్వామి తెలిపారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని లూథరన్ అంధుల ఉన్నత పాఠశాలలో మంగళవారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన న్యాయమూర్తి మధుస్వామి మాట్లాడుతూ, మానసిక ఆరోగ్య సమస్యలు ఉన్నవారి పట్ల వారి కుటుంబ సభ్యులు, సమాజం బాధ్యతతో మెలగాలని హితవు పలికారు. సానుభూతితో వారి సమస్యలను అర్థం చేసుకొని అండగా నిలవాలని తెలిపారు. ఈసందర్భంగా విభిన్న ప్రతిభావంతుల హక్కులు, వారికి కల్పిస్తున్న చట్టాలను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని వి.విజయమెటిల్డా, వన్ టౌన్ ఎస్ఐ రహంతుల్లా, సైకాలజిస్ట్ డాక్టర్ కె.శ్రీనివాసు, పారా లీగల్ వలంటీర్ ఎం.కాంచన, వార్డెన్ ఎస్.సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయమూర్తి మధుస్వామి

శరవేగంగా ఆర్వెస్టింగ్ నిర్మాణ పనులు

జిల్లా ఉపాధి పీడీ గంగవరపు జోసఫ్‌కుమార్

శావల్యాపురం: నీటి సంరక్షణలో భాగంగా భూగర్భ జలాలు పెంపుదలకు రూఫ్ టాప్ వాటర్ ఆర్వెస్టింగ్ విధానం దోహదపడుతుందని జిల్లా ఉపాధి పథకం డ్వామా పీడీ గంగవరపు జోసఫ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని కొత్తలూరు గ్రామంలో ఎంపీపీ స్కూల్లో రూఫ్ టాప్ వాటర్ ఆర్వెస్టింగ్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పీడీ జోసఫ్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ భవనాల సముదాయాల్లో వర్షపునీరు వృథా పోకుండా ప్రత్యేకంగా శ్లాబు మార్గంలో పైపులైను ఏర్పాటు చేసి నీటిని పొదుపు చేసే కార్యక్రమంలో భాగంగా చర్యలు చేపట్టామన్నారు. జిల్లాలో మొదట దశలో 250 యూనిట్స్ ఎంపిక చేశామన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ భవనాలు తదితర వాటిలో ఈ నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. ఆయనతో పాటు ఎంపీడీవో పి.సీతారామయ్య, ఏపీవో రామారావు, ఉపాధి టీఏలు బేబీరోజా, శ్రీనివాస గుప్తా, ఫీల్డ్ అసిస్టెంట్స్ పోట్ల హనుమంతరావులు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ జోసఫ్‌కుమార్

హనుమాపురంలో ఆర్వో వాటర్ ప్లాంట్

బొల్లాపల్లి : మండలంలోని హనుమాపురంలో ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావులు మంగళవారం ప్రారంభించారు. గుమ్మనంపాడు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష నూతన భవనాలు, అయ్యన్నపాలెంలో నూతన భవనాల ప్రారంభం అనంతరం మంచినీటి పథకాన్ని ప్రారంభించి మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల్లో తాగునీటి సౌకర్యం పూర్తిస్థాయిలో కల్పిస్తామని అన్నారు. వరికపుడిశెల ఎత్తిపోతల పథకానికి పూర్తిస్థాయిలో అనుమతులు లభించాయని, త్వరలో నిర్మాణం ప్రారంభంకానుందని, దీంతో మండలంలో సాగు, తాగు నీటికి డోకా ఉండదన్నారు. స్వచ్ఛంద సంస్థ ద్వారా గ్రామాల్లో ఆర్వో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఆర్.బీమ్లీబాయి, గ్రామ సర్పంచ్ కె.గున్నీబాయి, బి.శ్రీను నాయక్, ఎం.గోపీనాయక్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థతో పాలనలో మార్పు

బొల్లాపల్లి: పాలనలో మార్పులో భాగంగా సచివాలయ వ్యవస్థ రూపుదాల్చిందని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. మండలంలోని గుమ్మనంపాడు, అయ్యన్నపాలెం, హనుమాపురం సచివాలయాల పరిధిలో నూతన భవనాలు, పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. పలు గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ నాలుగున్నరేళ్ల పాలనలో గ్రామాల్లో అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. గుమ్మనంపాడు గ్రామంలో రూ.40 లక్షలతో సచివాలయం, రూ.21.80 లక్షలతో ఆర్‌బీకే, రూ.17.50 లక్షలతో హెల్త్ క్లినిక్, నాడు–నేడులో భాగంగా జెడ్పీ హైస్కూల్ ప్రహరీ రూ.23.60 లక్షలతో నిర్మించిన, అయ్యాన్నపాలెంలో రూ.17.50 లక్షలతో హెల్త్ క్లినిక్, రూ.21.80 లక్షలతో ఆర్‌బీకే , రూ.30 లక్షల నిధులతో సీసీరోడ్లు, డ్రెయినేజీ వంటి పలు అభివృద్ధి పనులు పూర్తిచేశామని తెలిపారు. గుమ్మనంపాడు గ్రామంలో రూ.14.49 కోట్ల మేర అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందజేశామని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు సర్పంచ్‌లు కటారి పుల్లమ్మ, నిమ్మల వెంకాయమ్మ, పీపాల సాయిబాబు, ఎంపీటీసీలు వి. వెంకటరెడ్డి, వి.లక్ష్మీబాయి, జెడ్పీటీసీ ఆర్. బీమ్లీబాయి, జీడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ డి. గోవిందు నాయక్, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ బత్తి గురవయ్య, డీఆర్‌డీఈ ఎస్ కోటేశ్వరరావు, తహసీల్దార్ ఎన్.దుర్గేశ్వరరావు, ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎస్‌కె జిలానీబాషా, ఈపూరు మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ శ్రీరామిరెడ్డి, కాంతానాయక్, ఎం.రాజయ్య, ఆర్.కృష్ణానాయక్, ఎ.సాంబిరెడ్డి, పి. అవినాష్ రెడ్డి, గాలిరెడ్డి, మస్నెయ్య, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.



గుమ్మనంపాడులో సచివాలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు, మక్కెన

జిల్లాస్థాయి పోటీలకు 20 మంది విద్యార్థులు

శావల్యాపురం: స్కూల్ గేమ్స్ విభాగంలో నియోజకవర్గ స్థాయిలో ఈనెల 7న వినుకొండ లయోలా స్కూల్లో జరిగిన క్రీడా పోటీల్లో జిల్లాస్థాయి పోటీలకు శావల్యాపురం హైస్కూలు విద్యార్థులు అర్హత సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బోడ్డపాటి విజయలక్ష్మి మంగళవారం తెలిపారు. ఈసందర్భంగా పాఠశాల పీడీ రాగుల రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ 20 మంది విద్యార్థులు టెన్నీ కాయిట్, యోగ, బాల్‌బ్యాడ్మింటిన్, త్రోబాల్, అథ్లెటిక్స్, నందు క్రీడా పోటీల్లో ప్రతిభ చూపించి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికై నట్లు తెలిపారు. అండర్–14 బాలికల విభాగంలో కె.తులసి (7వ తరగతి) పరుగుపందెం, స్వప్నిక రత్న (9వతరగతి) టెన్నికాయిట్, లక్ష్మి ప్రసన్న (8వతరగతి) త్రోబాల్, యు. లలితా (8వ తరగతి) సి.హెచ్.హర్షత, బి.రవలీ, టి.అంజన, రత్నకీర్తిన, బాల్‌బ్యాడ్మింటిన్ గేమ్స్ ఎంపికైనట్లు చెప్పారు. అండర్ –14 విభాగంలో బి.వెంకటేశ్ (8వ తరగతి) బాల్‌బ్యాడ్మింటిన్ పోటీల్లో ఎంపికైనట్లు పీడీ తెలిపారు. అండర్–బాలికల విభాగంలో ఆర్.వసు యోగ,ఆరీషా, హేమపూజిత, త్రోబాల్ నందు, వి.బసవరాణి, స్రవంతి, లూధియా, దివ్య, దేవమణి బాల్‌బ్యాడ్మింటిన్ క్రీడా పోటీలకు ఎంపికై నట్లు తెలిపారు. అండర్–17 బాలురు విభాగంలో శివప్రసాదు యోగసనాలు, ధన్‌రాజ్ బాల్ బ్యాడ్మింటెన్‌లు జిల్లాస్థాయి క్రీడాపోటీల్లో ఎంపికైనట్లు పాఠశాల పీడీ రాగుల రాధాకృష్ణమూర్తి తెలిపారు. జిల్లా పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.



పోటీల్లో ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతులకు మెరుగైన సేవలు



రైతులకు విత్తనాలను పంపిణీ చేస్తున్న ఎంపీపీ జయరామిరెడ్డి

వినుకొండ(నూజెండ్ల): గ్రామస్థాయిలో రైతులకు ప్రభుత్వం అందజేస్తున్న సేవలు, సంక్షేమ పథకాలు చేరువ చేసేందుకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి విప్లవాత్మకమైన మార్పులను అన్నదాతల కోసం తీసుకొచ్చారని ఎంపీపీ మేడం జయరామిరెడ్డి అన్నా రు. నూజెండ్ల మండలంలోని రవ్వవరం గ్రామంలో గల రైతు భరోసా కేంద్రం నందు మండల వ్యవసాయ అధికారిణి షేక్ సుగుణా బేగం అధ్యక్షతన ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పాల్గొన్న ఎంపీపీ మాట్లాడుతూ రైతన్నలకు ఆర్బీకేల ద్వారా అవసరమైన అనేక సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు.

విధులకు న్యాయవాదులు గైర్హాజరు

నరసరావుపేట: కోర్టులో దాఖలు చేసే అప్లికేషన్లు, పిటిషన్‌లపై రూ.20ల అడ్వకేట్ వెల్ఫేర్ ఫండ్ స్టాంపును అంటించాలనే ఏపీ బార్ కౌన్సిల్ ఆదేశాలకు వ్యతిరేకంగా స్థానిక న్యాయవాదులు 13వ తేదీ వరకు విధులకు గైర్హాజరు కావాలని నిర్ణయించారు. ఈ మేరకు మంగళవారం న్యాయవాదులెవరూ కోర్టులకు హాజరు కాలేదు. బార్ కౌన్సిల్ ఏకపక్షంగా తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా నరసరావుపేట బార్ అసోసియేషన్ విధులకు గైర్హాజరు కావాలని నిర్ణయం తీసుకోవటం జరిగిందని బార్ అసోసియేషన్ అధ్యక్షులు మేదరమెట్ల నాగేశ్వరరావు వెల్లడించారు. న్యాయవాదులు అందరూ సహకరించాలని కోరారు.

సెల్‌ఫోను రికవరీ చేశారు!

శావల్యాపురం: సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న బాధితులు సమగ్ర ఆధారాలతో ఫిర్యాదు చేస్తే సత్వరమే న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని ఎస్సై తుళ్లూరి తిరుపతిరావు వెల్లడించారు. మంగళవారం స్థానిక పోలీసు స్టేషనులో సెల్‌ఫోన్ రికవరీ చేసి సంబంధిత వ్యక్తికి సదరు సెల్‌ఫోన్ అందజేశారు. నూతన సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ఎక్కువ విలువ చేసే సెల్‌ఫోన్లు ఇటీవల అధిక సంఖ్యలో చోరీకు గురవుతున్నాయన్నారు. సెల్‌ఫోను ఐయంఇ నంబరు ద్వారా పోయిన సెల్‌ఫోను గుర్తిస్తామన్నారు. అనంతరం శావల్యాపురం గ్రామానికి చెందిన సాతులూరి ఆనందరావుకు చెందిన రూ.25 వేలు విలువ చేసే సెల్‌ఫోను రికవరీ చేసి అందజేశామన్నారు.

మైనర్ బాలిక మిస్సింగ్‌పై కేసు నమోదు

నాదెండ్ల: మైనర్ బాలిక అదృశ్యమైన సంఘటనపై పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఎస్సై జె.బలరామి రెడ్డి తెలిపిన వివరాల మేరకు నాదెండ్ల ఎస్సీ కాలనీలో నివాసం ఉండే తండ్రి తన 16 ఏళ్ల కుమార్తె రెండు రోజులుగా కనిపించటం లేదని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పదో తరగతి పూర్తి చేసి, రెండురోజుల క్రిందట కాలనీలోని తమ బంధువుల ఇంటికి వెళ్లి వస్తానని చెప్పి వెళ్లిందన్నారు. తిరిగి ఇంటికి రాకపోయేసరికి బంధువుల ఇళ్ళలో వెతికినా ఆచూకీ లభించకపోవటంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రస్థాయి షూటింగ్‌బాల్ పోటీలకు సొలస జెడ్పీవిద్యార్థులు



యడ్లపాడు: రాష్ట్రస్థాయి షూటింగ్‌బాల్ పోటీలకు మండలంలోని సొలసగ్రామంలోని జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు నలుగురు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం ఈవీ శ్రీనివాస్ తెలిపారు. ఎంపికై న విద్యార్థులను ఆయన ఉపాధ్యాయులతో కలిసి అభినందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ గుంటూరు జిల్లా షూటింగ్‌బాల్ జట్టు ఎంపిక పోటీలు నాదెండ్ల మండలం చిరుమామిళ్లలోని జెడ్పీహైస్కూల్లో మంగళవారం జరిగాయి. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో అండర్ –17 బాలికల విభాగంలో పదోతరగతి విద్యార్థినులు కోకిల, అభినయశ్రీ, నాగలక్ష్మి, అలాగే బాలుర విభాగంలో ప్రణదీప్‌కుమార్ పోటీల్లో తమ ప్రతిభను చాటారు. దీంతో రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు జిల్లాజట్టు సభ్యులుగా ఎంపికై నట్లు వెల్లడించారు. వీరు నలుగురు త్వరలో అనంతపురం జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి షూటింగ్‌బాల్ క్రీడాపోటీల్లో పాల్గొనున్నట్లు తెలిపారు.